ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 నంద్యాల
జిల్లా వార్తలు
మంగళవారం 23 ఏప్రిల్ 2024





పదిలో 19 వ స్థానం

- జిల్లాలో 85.62 శాతం ఉత్తీర్ణత
- బాలురు 83 శాతం, బాలికలు 88 శాతం
- గత ఏడాది కంటే 25 శాతం ఎక్కువ
- 18 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత
- మే 24 నుంచి జూన్ 3 వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 22: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. నంద్యాల జిల్లా 85.62 శాతంతో రాష్ట్రంలో 19వ స్థానంలో నిలిచింది. మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. బాలురు 12,283 మంది, బాలికలు 11,504 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలురు 10,216, బాలికలు 10,151 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం మీద 23,787 మందికి గాను 20,367మంది విద్యార్థులు పాసయ్యారు. బాలురు 83.17 శాతం, బాలికలు 88.24 శాతం సాధించారు. బాలుర కన్నా ఉత్తీర్ణతలో బాలికలే పైచేయి సాధించారు. జిల్లాలో నంద్యాల మండలం 92.34 శాతంతో మొదటి స్థానంలో ఉండగా మిడుతూరు మండలం 69.11శాతంతో చివరి స్థానంలో ఉంది.

గత ఏడాది కంటే 25శాతం ఎక్కువ : 2022-2023 విద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో 60.39 శాతం ఉత్తీర్ణతతో నంద్యాల జిల్లా రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచి అభాసుపాలయ్యింది. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలను సాధించేందుకు విద్యాశాఖ అధికారులు పాఠశాలల ప్రారంభం నుంచే ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక తరగతులతోపాటు పదో తరగతి మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. డి గ్రేడ్ విద్యార్థులను గుర్తించి వారిపట్ల మరింత శ్రద్ధ చూపారు. దీంతో గత ఏడాదికన్నా 25శాతం ఉత్తీర్ణత ఎక్కువ నమోదైంది.

జిల్లాలో నంద్యాలలోని గుడ్‌షెప్పర్డ్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థి చరణ్‌కుమార్ , నంద్యాలలోని చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆర్ఎస్ రోడ్ పాఠశాల విద్యార్థిని నాగవైష్ణవి 600 మార్కులకు 596 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. వీరితో పాటు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వెలుగోడు మాడల్ స్కూల్‌కు చెందిన కొండా సాయి చరణ్ 593, నంద్యాల కెయస్ఎం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి సాగర్ 592. అవుకు మండలం గుండ్ల శింగవరం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి అమరేశ్వర్‌రెడ్డి 591, పాణ్యం మండలం నెరవాడ ఎంపిజెబిసి విద్యార్థిని జుబేదా బేగం 589, నంద్యాల కెజిబివి మైనార్టి పాఠశాల విద్యార్థిని వడ్ల ఆఫ్రిన్ 585, కోవెలకుంట్ల ఏపయస్ డబ్ల్యూ ఆర్ స్కూల్ విద్యార్థిని శ్రీరాముల మహిమారాణి 582 మార్కులు సాధించి టాపర్‌లుగా నిలిచారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు: జిల్లాలో మొత్తం 451 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 23,787 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. గత ఏడాదిలో పదో తరగతి పరీక్షల్లో 14 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 18 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. 80 ప్రైవేటు పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణతను సాధించాయి.

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు

- గడివేముల మండలం కరిమద్దెల జడ్పీహెచ్ఎస్
- శిరివెళ్ల మండలం గోవిందపల్లె జడ్పీహెచ్ఎస్
- దొర్నిపాడు మండలం డబ్ల్యు కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్
- రుద్రవరం మండలం నరసాపురం జడ్పీహెచ్ఎస్
- కోవెలకుంట్ల జడ్పీహెచ్ఎస్
- కొలిమిగుండ్ల మండలం అబ్దుల్లాపురం జడ్పీహెచ్ఎస్
- వెలుగోడు ఏపీ మోడల్ స్కూల్
- నంద్యాల ఏపీ మోడల్ స్కూల్
- పాణ్యం కేజీబీవీ
- నంద్యాల కేజీబీవీ మైనార్టీ
- శిరివెళ్ల కేజీబీవీ,
- ఎంజేపీఆర్ఏపీ బీసీడబ్ల్యూ ఆర్ఈఎస్ నెరవాడ
- ఎంజేపీఏడబ్ల్యూసీడబ్ల్యూ (గర్ల్స్), ఆళ్లగడ్డ
- శ్రీశైలం ఏపీటీ డబ్ల్యూ ఆర్ఎస్
- ఆశ్రమ పాఠశాల, ప్యాపిలి
- నంద్యాల సెయింట్ జోసఫ్ ఎయిడెడ్ స్కూల్
- నంద్యాల హోలీక్రాస్ హైస్కూల్ ఎయిడెడ్
- రుద్రవరం మండలం మందలూరు ఎయిడెడ్ పాఠశాల


సాయిచరణ్(593) వెలుగోడు


నాగవైష్ణవి(596) (నంద్యాల)


శ్రావ్యశ్రీ(591) మిడ్తూరు


అమరేశ్వర్(591 అవుకు

మే 24 నుంచి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు: పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల టైంటేబుల్ త్వరలోనే ప్రకటించనున్నారు. ఏప్రిల్ 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు నిర్ణయించారు. ఆలస్యమైతే రూ.50 అపరాధ రుసుముతో మే1 నుంచి మే 23వ తేదీలోపు చెల్లించుకోవచ్చునని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రతి సబ్జెక్టు జవాబులను రీకౌంటింగ్ దరఖాస్తు రుసుము రూ.500-, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు.



ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ఉత్తీర్ణత శాతం ఇలా..

ఏపీఆర్ఐఈ సొసైటీ (బీసీ)- 99శాతం
ఏపీఆర్ఐఈ సోషల్ వెల్ఫేర్-97.12శాతం
ఏపీఎంఎస్-95.11శాతం
ఏపీట్రైబల్ వెల్ఫేర్ -89.78శాతం
కేజీబీవీ 88.14శాతం
ఆశ్రమ పాఠశాలలు-79.44శాతం
మున్సిపల్ పాఠశాలలు-79.12శాతం
జిల్లా పరిషత్ పాఠశాలలు-76.57శాతం
ఎయిడెడ్ పాఠశాలలు -72.10శాతం
ప్రభుత్వ పాఠశాలలు 67.90శాతం

దళితుడిపై వైసీపీ నాయకుల దాడి

తీవ్ర రక్తగాయాలతో ఆసుపత్రిలో చేరిక


రక్తగాయాలతో పెరుమాళ్ల చంద్రశేఖర్

గడివేముల, ఏప్రిల్ 22: ఓ దళితుడిపై వైసీపీ నాయకులు దాడులకు తెగబడ్డారు. గడివేముల మండలంలోని దుర్వేసి గ్రామంలో సోమవారం రాత్రి దళితుడిపై వైసీపీ నాయకులు విచక్షణా రహితంగా దాడి చేశారు. బాధితుడు పెరుమాళ్ల చంద్రశేఖర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా... పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత దుర్వేసి గ్రామంలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారం కార్యక్రమంలో పెరుమాళ్ల చంద్రశేఖర్ కూడా పాల్గొన్నారు. ప్రచారం ముగిసిన అనంతరం పెరమాళ్ల చంద్రశేఖర్ ఇంటికి వెళ్తుండగా వైసీపీ నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి ఇంటి వద్ద అతడి కుమారుడు సాయికుమార్‌రెడ్డి ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడపడంతో పెరుమాళ్ల చంద్రశేఖర్ అభ్యంతరం తెలిపారు. దీనిపై కోపోద్రిక్తుడైన సాయికుమార్‌రెడ్డి 'నువ్వు ఎన్నికల ప్రచారానికి వెళ్లేంతటి వాడివా రా..' అంటూ పెరుమాళ్ల చంద్రశేఖర్‌పై కర్రతో దాడి చేశారు. తీవ్ర రక్తగాయాలపాలైన పెరమాళ్ల చంద్రశేఖర్‌ను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి జరిగిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

నిందితుల అరెస్టు

- 827 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి స్వాధీనం
- రెండు వాహనాలు కూడా..
- రాష్ట్ర వ్యాప్తంగా నిందితులపై ఆరు కేసులు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 22 : దొంగతనం కేసుల్లో ఇద్దరు నిందితులను నంద్యాల పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 827 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. భార్యాభర్తలైన ఆవుల కిరణ్‌కుమార్ అలియాస్ రాహుల్, దుగ్గిరాల రాణిలను నంద్యాల పట్టణంలోని ఆటోనగర్ హైవే బ్రిడ్జి కింద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై ఇప్పటికే రాష్ట్రంలో ఆరు కేసులు నమోదై ఉన్నాయన్నారు. నంద్యాల రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు దొంగతనం కేసులు నమోదయ్యాయని తెలిపారు. గతంలో నంద్యాల పట్టణంలోని టెక్కె ప్రాంతంలోని తేజ అపార్ట్‌మెంట్‌లో మద్దెల సుధాకర్, కొప్పుల శ్రావణి దంపతుల ఇంట్లో ఈ నిందితులు దొంగతనం చేశారు. బాధితురాలు శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, వీరిని పట్టుకునేందుకు కర్నూలు రేంజ్ డీఐజీ సిహెచ్ విజయరావు పర్యవేక్షణలో నంద్యాల టూ టౌన్ సీఐ కె.రాజారెడ్డి, నంద్యాల సీసీఎస్ సీఐ మంజునాథరెడ్డి, నంద్యాల టూ టౌన్ ఎస్సై బి.కె. మల్లికార్జున వారి సిబ్బంది ఈ నెల 21న సాయంత్రం 3:30 గంటల సమయంలో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరినుంచి 27 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మూడు, విశాఖపట్టణం జిల్లా ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఒకటి, గుంటూరు జిల్లా నగరపాలెం పోలీసు స్టేషన్‌లో ఒక కేసు నమోదై ఉన్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

కీలక భేటీ

- కేఈ బ్రదర్స్‌తో టీడీపీ నేతల చర్చ
- ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘ మంతనాలు


కేఈ కృష్ణమూర్తితో మాట్లాడుతున్న కీలక నాయకులు

కర్నూలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ డిప్యూటీ సీఎం, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి వయోభారం, ఆరోగ్యం రీత్యా ప్రస్తుతం ఎన్నికలకు దూరంగా ఉన్నారు. సోమవారం టీడీపీ కీలక నాయకులు ఆయన్ను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జోన్-5 ఇన్‌చార్జి బీద రవిచంద్ర యాదవ్, కర్నూలు పార్లమెంట్ పరిశీలకుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడులు కేఈ కృష్ణమూర్తిని కర్నూలులోని ఆయన స్వగృహంలో కలిశారు. జిల్లాలో రాజకీయాలు, తాజా ఎన్నికల్లో టీడీపీ గెలుపు వ్యూహాలపై చర్చించారు. పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలకు సంబంధించి కేఈ పలు సూచనలు చేశారు. టీడీపీ టికెట్ ఇవ్వకపోగా.. తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని అసంతృప్తిగా ఉన్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌ను ఆయన ఫాంహౌస్‌లో టీడీపీ బృందం కలిసింది. ఈ భేటీలో పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఆదోనిలో కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధికి.. టీడీపీ, జనసేన నాయకుల మధ్య సమన్వయం కోసం చర్చలు జరిపారు. అంతకు ముందు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్లమెంటు, అసెంబ్లీ టీడీపీ అభ్యర్థుల నామినేషన్లపై కీలక నాయకులు చర్చించారు.

నాలుగో రోజు 25 నామినేషన్లు

ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి, ఎమ్మెల్యే స్థానాలకు జయసూర్య, అఖిలప్రియ దాఖలు


నామినేషన్ వేస్తున్న గిత్తా జయసూర్య




నంద్యాల ఎంపీ, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే స్థానాలకు నామినేషన్లు అందజేస్తున్న బైరెడ్డి శబరి, అఖిలప్రియ

నంద్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం నామినేన్లు జోరుగా సాగాయి. నంద్యాల పార్లమెంటుకు ఆరుగురు, జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు 19 వెరసి నాలుగో రోజు మొత్తం 25 నామినేషన్లు దాఖలయ్యాయి. నంద్యాల పార్లమెంటుకు టీడీపీ తరపున బైరెడ్డి శబరి, కాంగ్రెస్ అభ్యర్థి మేకల హిమబిందు, స్వతంత్ర అభ్యర్థులు జి వెంకటరమణ, మల్లేశ్వరుడు, జి పుష్పావతి, శివకుమార్ నామినేషన్లు సమర్పించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి టీడీపీ తరపున భూమా అఖిలప్రియ, నీతి నిజాయితీ పార్టీ అభ్యర్థి చుండూరు వెంకటరమణ, ప్రజా ఏక్తా పార్టీ నుంచి ముక్కామల కృష్ణారెడ్డి నామినేషన్లు వేశారు. శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ నుంచి బుడ్డా రాజశేఖరరెడ్డి రెండు సెట్లు, బహుజన సమాజ్ పార్టీ నుంచి పల్లె చంద్రశేఖర్‌రెడ్డి, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మహమ్మద్ యూనిస్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ నుంచి చింతా నాగేశ్వరరావు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థులు గిత్తా జయసూర్య, బండి జయరాజు, వైసీపీ నుంచి ధారా సుధీర్, స్వతంత్ర అభ్యర్థి ఎం బాలరాజు, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ నుంచి ఎన్ఎండీ ఫరూఖ్, యాపరాల్ల లక్ష్మీ నరసమ్మ, బనగానపల్లె అసెంబ్లీ నియోజకవ ర్గానికి సంబంధించి స్వతంత్ర అభ్యర్థులు కునుదుల వెంకటరెడ్డి, ఎర్రగుడి మధుకృష్ణ, గోగుల సుగుణమ్మ, డోన్ అసెంబ్లీ నియోజ కవర్గానికి సంబంధించి వైసీపీ నుంచి బుగ్గన రాజేంద్రనాథ్, టీడీపీ నుంచి కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఆవుల మహేశ్ నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి మూడు రోజుల్లో 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, నాలుగో రోజు 26 మంది నామినేషన్లు వేశారు. మొత్తం కలిసి 51 మంది నంద్యాల పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు వేశారు.


స్వామివారి దర్శనానికి వస్తున్న చంద్రబాబు దంపతులు

చంద్రబాబుకు ఘన స్వాగతం

- శ్రీశైల మల్లన్న సేవలో చంద్రబాబు దంపతులు
- పుణ్యక్షేత్రంలో బీ-ఫారం అందుకున్న బుడ్డా, బీసీ


శ్రీశైలం, ఏప్రిల్ 22: శ్రీశైలం పర్యటనకు వచ్చిన మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ కీలక నాయకులు ఘన స్వాగతం పలికారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు సోమవారం చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి శ్రీశైలానికి వచ్చారు. ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు చంద్రబాబు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్యేలు బీసీ జనార్ధన్ రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి తదితరులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా చంద్రబాబు దంపతులు సాక్షిగణపతి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం శ్రీశైలం చేరుకుని క్షేత్రపరిధిలోని బయలు వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. తర్వాత స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న చంద్రబాబు దంపతులకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు దంపతులు మల్లికార్జున స్వామికి అభిషేకం, భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం చంద్రబాబు దంపతులకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం తిరిగి హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు వెళ్లారు.



శైవక్షేత్రంలో బీ-ఫారం అందుకున్న బుడ్డా, బీసీ

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలానికి విచ్చేసిన టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు నియోజకవర్గాల అభ్యర్థులకు బీ-ఫారంలను అందజేశారు. శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహంలో వాటిని అందజేశారు. బనగానపల్లె, శ్రీశైలం అభ్యర్థులు బీసీ జనార్దన్ రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి బీఫారం చంద్రబాబు నుంచి అందుకున్నారు. అదేవిధంగా అనంతపురం జిల్లా రాయదుర్గం అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, శ్రీసత్యసాయి జిల్లా కదిరి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ బీఫారాలను అందుకున్నారు. ఎన్నికల్లో మంచి పోల్ మేనేజ్‌మెంట్ నిర్వహించి ఘన విజయం సాధించాలని చంద్రబాబు అభ్యర్థులకు సూచించారు. మల్లన్న సన్నిధిలో నామినేషన్ పత్రాలను స్వీకరించడంపై ఆయా అభ్యర్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.


స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం


బీ ఫారాలు అందుకుంటున్న బుడ్డా, బీసీ తదితరులు

నాడు చేతులెత్తి ఓటు తెలిపేవాళ్లం

సీనియర్ సిటిజన్



దేవనకొండ, ఏప్రిల్ 22: స్వాతంత్ర్యం అనంతరం ఓటు వచ్చిందని, నాడు ఓటు అంటే చేతులెత్తి తెలిపేవాళ్లమని దేవనకొండకు చెందిన 94 యేళ్ల వృద్ధురాలు కాకర్ల మంగమ్మ తెలిపారు. గ్రామంలో నిర్ణయించిన ప్రదేశంలో ఒక చోట (పీర్ల మసీదు, మారెమ్మగుడి)కు గ్రామ ప్రజలు వచ్చే వాళ్లని, అక్కడ అభ్యర్థుల పేర్లు ప్రకటించినప్పుడు చేతులెత్తి ఓటు వేసేవారని వివరించారు. ఎక్కువ మంది చేతులు ఎత్తితే ఆ అభ్యర్థి విజయం సాధించినట్లని చెప్పారు. ప్రస్తుతం చాలా మార్పులు వచ్చాయన్నారు. నాడు చదువుకున్న వారి సంఖ్య చాలా తక్కువన్నారు. ఆ రోజుల్లో డబ్బు ప్రభావం ఉండేది కాదని, మాటకు కట్టుబడి ఓటు వేసేవారని తెలిపారు.

అప్పుడు అభిమానం.. ఇప్పుడు డబ్బు



బండిఆత్మకూరు, ఏప్రిల్ 22: నా వయస్సు సుమారు 80 ఏళ్లు. ఇప్పటికి 12 ధపాలు ఓట్లు వేశాను. మేము ఆ రోజుల్లో అభిమానం ఉన్న నాయకుడికి మాటిచ్చే వాళ్లం. వారికే వేసే వాళ్లం. నేడు డబ్బు ఎవరు ఎక్కువ ఇస్తే వాళ్లకు, ఉచిత పథకాల ఎరకు ఓటు వేస్తున్నారు. ఓటుకు ముందు ఉచితాలు ఎర వేసి గద్దెనెక్కిన తరువాత మనతో ఉన్నదంతా లాగేస్తారు. ఓటు మన ఆయుధం అది ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలి. అమ్ముడు పోరాదు. గతంలో ఓట్ల రోజు ఉదయాన ఉప్పిండి లేక ఉగ్గాని పెట్టేవారు. అయినా కొందరం దాన్ని కూడా తీసుకునే వాళ్లం కాదు.

- ఆరేలి లింగన్న, పెద్దదేవళాపురం

నాడు ఇచ్చేవారు లేరు.. అడిగే వారు లేరు



ఎమ్మిగనూరు, ఏప్రిల్ 22: నావయస్సు 72 ఏళ్లు. ఇప్పటికి పదిసార్లు ఓటు వేసి ఉంటా. నాకు ఓటు హక్కు వచ్చిన సమయంలో.. ఎన్నికలంటే ఏమో తెలిసేది కాదు. ఇప్పటిలా అప్పట్లో ఎవరు ఓటు వేసేందుకు డబ్బు అడిగే వారు కాదు.. అలాగే ఓటు వేసేందుకు ఎవరు డబ్బు ఇచ్చే వారు కాదు. ఎన్నికల సమయంలో తేరు బజారులో మాచాని సోమప్ప మీటింగ్ పెట్టి చేప్పేవారు. ఆయన చెప్పిన ప్రకారం చేసేవారం. ఎన్నికలంటే తెలిసి వచ్చింది ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు, తెలుగుదేశం వచ్చిన తరువాతే. అంత వరకు మా బోటి వాళ్లకు ఎన్నికల గురించి తెలిసేది కాదు. మంచి ప్రభుత్వం రావాలని ఓటు వేసేవాడ్ని. అయితే ఇప్పుడు అంతా డబ్బు మయంగా మారింది. ఎన్నికలు వచ్చాయంటే ఎవరు డబ్బు ఇస్తారు.. ఎంత ఇస్తారు.. ఎక్కువ ఎవరు ఇస్తారు అని చూస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు.

- బండ బసన్న, ఎమ్మిగనూరు

మాట ఇచ్చిన వారికే ఓటు వేసేవారు



పాణ్యం, ఏప్రిల్ 22 : గతంలో ఓటు వేసేవారు నిక్కచ్చిగా ఉండేవారు. ఎవరికి మాట ఇచ్చారో వారికే ఓటు వేసేవారు. గ్రామంలోని రెండు వర్గాలు ఉంటే ఆ పార్టీ నాయకులకు నిక్కచ్చిగా ఓటు వేసేవారు. ఎన్నికల సమయంలో డబ్బులతో ప్రలోభపెట్టేవారు కాదు. పేటలోని తమ వర్గాలకు పెళ్లిళ్లకు అవసరమయ్యే శాశ్వతమైన షామియానాలు, వంట పాత్రలు, దుప్పట్లు ఇచ్చేవారు. ఎన్నికల రోజు ఉదయాన్నే ఓటు వేసేందుకు రావాలని బొరుగుల బస్తాలు ఇచ్చి వంట చేయించి పోలింగ్‌కు వెళ్లే వాళ్లు. అభ్యర్థికి ఇచ్చిన మాట ప్రకారం వారికే ఓటు వేసేవారు. డబ్బులు పంచి ప్రలోభాలకు గురి చేసేవారు కాదు. ప్రస్తుతం డబ్బు ఇచ్చినా ఓటు వేస్తారన్న నమ్మకం లేదు. ఎవరికి ఓటు వేశారో గర్వంగా చెప్పుకునేవారు. ఇప్పుడు ఎవరికి ఓటు వేశామో చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో గ్రామ సమస్యలను గుర్తించిన నాయకునికే పట్టం కట్టేవారు. కాంగ్రెస్, జనతా పార్టీలు ఉండేవి. స్వతంత్ర అభ్యర్థులు పాణ్యం నుంచి గెలిచి ఎమ్మెల్యేలయ్యారు.

సామాన్యుల సంజీవని

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి
- నిజాయితీకి నిలువెత్తు రూపం
- నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం
- ఆయనే మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య

కర్నూలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):

దామోదరం సంజీవయ్య.. భారత ప్రజాస్వామ్య కీర్తిపతాక. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. యువతరానికి స్ఫూర్తిదాయకం. సంయుక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఓ దళితుడు తొలిసారిగా బాధ్యతలు చేపట్టడం దేశ రాజకీయ చరిత్రలో లిఖించదగ్గ అధ్యాయం. ముగ్గురు ప్రధానుల నాయకత్వంలో కేంద్ర మంత్రిగా.. మూడు రాష్ట్రాలు.. ముగ్గురు ముఖ్యమంత్రుల నాయకత్వంలో మంత్రిగా పని చేసిన ఆయన జీవన యానం త్రివేణి సంగమం (త్రినిటీ). అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్ష పీఠాన్ని రెండు పర్యాయాలు అధిష్టించడం సామాన్యమైన విషయం కాదు. భారత దేశ ప్రజాస్వామ్య ఘనతకు దామోదరం సంజీవయ్య జీవితం ఒక గొప్ప ఉదాహరణ అని ఓ సందర్భంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవచ్చు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిస్తే పది తరాలకు తరగని ఆస్తి పోగేసుకుంటున్న రాజకీయ నాయకుల్లో దామోదరం సంజీవయ్య లాంటి మహనీయులు దీపం పెట్టి వెతికినా కనిపించరు. అందుకే ఆయన జీవిత చరిత్ర యువతరానికి స్ఫూర్తిదాయకం.





సతీమణి కృష్ణవేణితో దామోదరం సంజీవయ్య (ఫైల్)



పెద్దపాడులో దామోదరం సంజీవయ్య నివసించిన ఇల్లు

కర్నూలు నగరం సమీపంలో కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన మునెయ్య, సుంకులమ్మ నిరుపేద దంపతులకు ఐదో సంతానం దామోదరం సంజీవయ్య. 1921 ఫిబ్రవరి 14న జన్మించాడు. ఆయన పుట్టిన మూడు రోజులకే తండ్రి మృత్యువొడి చేరారు. మేనమామ సంరక్షణలో పెరిగారు. వ్యవసాయ కూలీ కుటుంబం కావడంతో ఆయన కుటుంబ సభ్యులు పశువులు కాసేవారు. పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేసేవారు. ఇలాంటి కుటుంబం నుంచి వచ్చిన సంజీవయ్య కర్నూలు మున్సిపల్ హైస్కూల్, అనంతపురం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో విద్యాభ్యాసం చేశారు. బ్రిటీష్ పాలనలో కర్నూలు సివిల్ సప్లయ్ విభాగం, బళ్లారి సివిల్ సప్లయ్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. అప్పుడే పరిచయమైన ఓ జడ్జి సలహాతో మద్రాసు వెళ్లి న్యాయశాస్త్ర విద్యా పూర్తి చేసి గణపతి శాస్త్రి, జాస్తి సీతారామక్ష్మి దగ్గర జూనియర్ అప్రెంటిస్‌గా చేరారు. 1950లో భారత్ గణతంత్ర దేశంగా ఆవిర్భావం తర్వాత ఒక వ్యక్తికి ఒకే పదవి అనే నిబంధన వచ్చింది. అప్పటికి కర్నూలుకు చెందిన సర్దార్ నాగప్ప ఎమ్మెల్యే, ఎంపీ రెండు పదవుల్లో ఉన్నారు. ఆయన ఎమ్మెల్యే పదవి ఉంచుకొని ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ సీటు ఎస్సీ రిజర్వుడు కావడంతో అభ్యర్థి ఎంపిక బాధ్యత ఎన్జీ రంగాకు అప్పగించారు. ఆ సమయంలో రామలక్ష్మమ్మ తన దగ్గర జూనియర్‌గా పని చేస్తున్న సంజీవయ్యను సూచించారు. దీంతో ఆయన తాత్కాలిక ఎంపీగా బాధ్యతలు చేపట్టారు. 1952లో జరిగిన కర్నూలు నుంచి ద్విసభ్య స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మద్రాసు రాష్ట్రం ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజాగోపాలాచారి (రాజాజీ) కాబినేట్‌లో హౌసింగ్, కో-ఆపరేటివ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

● రాజకీయ ప్రస్థానం త్రివేణి సంగమం:

మద్రాసు రాష్ట్రంలో 1952 - 1953 వరకు సీఎం రాజాజీ మంత్రివర్గంలో, కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావం తరువాత 1953 అక్టోబరు 1 నుంచి 1956 నవంబరు 1 వరకు సీఎం టంగుటూరి ప్రకాశం కాబినేట్‌లో సాంఘిక సంక్షేమ, ఆరోగ్య శాఖ మంత్రిగా, సీఎం బెజవాడ గోపాల్‌రెడ్డి క్యాబినెట్‌లో వాణిజ్య పన్నులు, స్థానిక సంస్థల పాలన శాఖ మంత్రిగా, 1956లో ఏర్పడిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి క్యాబినెట్‌లో కార్మిక, స్థానిక సంస్థల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రధానమంత్రులు నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రివర్గంలో కేంద్ర మంత్రిగా కొనసాగారు. మద్రాసు, కర్నూలు, హైదరాబాద్ కేంద్రాలుగా మూడు ప్రభుత్వాల్లో పని చేయడం విశేషమే. 1962-64 మధ్య నెహ్రూ హయాంలో, 1971-72 మధ్య ఇందిరాగాంధీ హయాంలో రెండు పర్యాయాలు అఖిల భారత జాతీయ కాంగ్రెస్ (ఏఐసీసీ) కమిటీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.

● దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నీలం సంజీవరెడ్డి పదవి కోల్పోవడంతో.. ఆ స్థానంలో 1962లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఓ దళిత నాయకుడు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవడం దేశంలోనే ప్రథమం. రెండేళ్ల మూడు నెలలు సీఎంగా కొనసాగారు.

● కృష్ణవేణితో వివాహం:

సికింద్రాబాదులో ఉపాధ్యాయినిగా పని చేస్తున్న కృష్ణవేణితో 1954 మే 7న సంజీవయ్య వివాహం జరిగింది. వీరికి సంతానంలో లేదు. సుజాత అనే ఓ బాలికను దత్తత తీసుకున్నారని అంటున్నారు. 1967లో ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయవాడ నుంచి హైదరాబాదుకు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై.. దీర్ఘకాలంగా కోలుకోలేకపోయారు. 1972 మే 7న ఢిల్లీలో గుండెపోటుతో మృతి చెందారు. మే 9న సికింద్రాబాదులోని పాటిగడ్డలో అంత్యక్రియలు చేశారు. ఆయన స్మారకార్థం అక్కడికి సమీపంలో సంజీవయ్య పార్కు ఏర్పాటు చేశారు. విశాఖలోని ఏపీ నేషనల్ లా యూనివర్సిటీని 2012లో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీగా పేరు మార్చారు. గాజులదిన్నె ప్రాజెక్టును సంజీవయ్య సాగర్‌గా పేరు పెట్టారు.

తొలి కమ్యూనిస్టు ఎమ్మెల్యే ఈశ్వర్‌రెడ్డి

ది లీడర్



పత్తికొండ, ఏప్రిల్ 22: ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొలి కమ్యూనిస్టు ఎమ్మెల్యేగా ఎర్రగుడి ఈశ్వర్‌రెడ్డి పత్తికొండ సెగ్మెంట్ నుంచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు భావాలతో పెరిగారు. గ్రామ కరణంగా పనిచేసిన ఆయన ఆ తర్వాత ఉద్యోగాన్ని వదిలి గిరిజనుల కోసం సీపీఎం తరఫున భూపోరాటాలకు దిగారు. గిరిజన ప్రజలకు సుమారు వెయ్యి ఎకరాల దాకా భూములను ప్రభుత్వం ద్వారా ఇప్పించారు. నాయకుడిగా పేదల పక్షాన పోరాటాలు చేస్తూ 1967లో పత్తికొండ నియోజకవర్గం నుంచి సీపీఎం తరఫున బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేబీ నరసప్పపై 1,526 ఓట్ల ఆధిక్యంతో గెలుపొంది ఉమ్మడి జిల్లాలో తొలి కమ్యూనిస్టు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కేబీ నరసప్ప చేతిలో ఆయన ఓడిపోయారు. ప్రజల పక్షాన పోరాటాలు చేసిన ఆయన 1979 ఆగస్టు 4వ తేదీ ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురయ్యారు.

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు

తెలుసుకుందాం



ఆదోని, ఏప్రిల్ 22: ఎన్నికల అధికారులు మూడు రకాలుగా పోలింగ్ కేంద్రాలను విభజించారు. ఇందులో ఒకటి సాధారణ పోలింగ్ కేంద్రం, రెండోది సమస్యాత్మక పోలింగ్ కేంద్రం, మూడోది అతి సున్నితమైన పోలింగ్ కేంద్రం. ఈ కేంద్రాల్లో రాజకీయ పార్టీలు తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు ఇతరేతర సమస్యలు దృష్టిలో ఉంచుకొని ఈ విధమైన చర్యలు తీసుకుంటారు. గతంలో పోలింగ్ కేంద్రాల్లో నెలకొన్న ఘటనల ఆధారంగా వీటిని మూడు రకాలుగా విభజిస్తారు. సాధారణ పోలింగ్‌కేంద్రం కంటే అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. ముందస్తు చర్యలను పోలీసులు తీసుకుంటారు. వీటిని ఇప్పటికే జియో ట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేశారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షించనున్నారు.

అభ్యర్థి చరిత్ర మన చేతిలోనే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల పూర్తి వివరాలు తెలుసుకోవడం ఇక సులువు. నామినేషన్ వేయగానే ఆ వివరాలను అభ్యర్థులు రిటర్నింగ్ ఆఫీసర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ affidavit.eci.gov.in వెబ్‌సైట్‌తో పాటు కొత్తగా know your candidate యాప్‌ను తీసుకువచ్చింది. ఇక్కడ అభ్యర్థి పేరు, నియోజకవర్గం పేరు, స్టేట్‌ను ఎంపిక చేసుకోవాలి. దీనిలో అఫిడవిట్, అభ్యర్థి నేర చరితతో పాటు వారికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి.

జీపులు, ఆటోలకు గిరాకీ


భలే చాన్సులే..!



గోనెగండ్ల, ఏప్రిల్ 22: ఎన్నికల ముందు వరకు జీపుల యజమానులు, ఆటో డ్రైవర్లు బాడుగలు లేక డీలపడిపోయారు. ఈఎంఐలు కట్టలేక ఇబ్బందులు కూడా పడ్డారు. ఇక ఎన్నికల వేడి ఎప్పుడు మొదలైందో అప్పటి నుంచి జీపు యజమానులకు డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు మంచి గిరాకీ వచ్చింది. రాజకీయ పార్టీల నాయకులు మండల కేంద్రాల నుంచి పల్లెలకు ప్రచారం నిమిత్తం వెళ్తుంటారు. వారికి జీపులు, ఆటోలు కావాల్సి ఉంది. దీంతో రాత్రే జీపు, ఆటో డ్రైవర్‌లతో మాట్లాడి ఉదయం కాగానే గ్రామాలకు ప్రచారానికి వెళ్తున్నారు. జీపునకు రోజుకు రూ.3000, డ్రైవర్ బత్త, డీజిల్, అదనం. ఇక ఆటోకు రూ. 1500, డ్రైవర్ బత్త, డీజిల్‌ను ఆయా రాజకీయ పార్టీ నాయకులే భరించాలి. దీనికి తోడు గ్రామాల్లో ప్రచారం కోసం ఉదయం వెళ్తారు. కార్యకర్తలతో పాటు డ్రైవర్‌లకు కూడా టిఫిన్ సౌకర్యం ఉంటుంది. గ్రామంలో రాజకీయ పార్టీల నాయకులు ఉదయం 6గంటలకు ప్రచారం ప్రారంభించి 10 గంటలకు ముగించుకొని తాము తీసుకువెళ్లిన వాహనాలలో తిరిగి గ్రామానికి చేర్చుతారు. గ్రామాలలో ప్రచారం ముంగించుకొని వాహనం దగ్గరకు వచ్చే వరకు జీపు, ఆటో డ్రైవర్‌లకు విరామమే. ఇక సాయంత్రం మరోసారి 5గంటల నుంచి 7 గంటల వరకు ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారు. ఇక ఆరోజు ప్రచారం ముగిసిపోతుంది. సాయంత్రం కార్యకర్తలకు ఇచ్చే ముందు బాటిల్ కోటాలోనే డ్రైవర్‌లకు క్వాటర్ బాటిల్ వస్తుంది. పెద్దగా కష్ట పడకుండా జీపు, ఆటో డ్రైవర్‌లకు మంచి భలే గిరాకీ వచ్చింది. రెండు నెలల ఈఎంఐలకు ఎలాంటి ఇబ్బంది లేదని వాహనాల యజమానులు తెలుపుతున్నారు.

ఎవరికి ఓటు వేశామో చూసుకోవచ్చు

టెక్నాలజీ



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 22: ఈవీఎంలో మనం ఎవరికి ఓటు వేశామో చూసుకోవచ్చు. నచ్చిన అభ్యర్థి పార్టీకి వేసిన ఓటు సక్రమమేనా లేక క్రాస్ అయిందా అనే అనుమానాన్ని నివృత్తి చేసుకోవచ్చు. అయితే.. ఈ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఓటరు వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) ద్వారా కల్పిస్తోంది. వేసిన ఓటును చూసుకునే అవకాశం ఏడు సెకండ్ల వరకు మాత్రమే ఉంటుంది. అనంతరం ఆ ఓటు వీవీ ప్యాడ్ బాక్స్‌లో పడిపోతుంది. ఈ విధానాన్ని తొలిసారిగా 2013 సెప్టెంబరులో నాగాలాండ్‌లోని నోక్సెన్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో అమలు చేశారు. ఆ తర్వాత దశల వారిగా అంతటా అమల్లోకి వచ్చింది. వేసిన ఓటును సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించడం, బహిర్గతం చేయడం మాత్రం నిషేధం. ఉల్లంఘిస్తే ఓటు రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.



ప్రచార కూలి రూ.500

మంచి తరుణం

సార్వత్రిక ఎన్నికలు వ్యవసాయ, దినసరి కూలీలకు భలే గిరాకి తెచ్చిపెట్టాయి. ప్రతి రోజూ గ్రామాల్లో రాజకీయ సమావేశాలు, మీటింగ్‌లు ప్రచారాలు ఉండటంతో వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లకుండా రాజకీయ సమావేశాలు, ప్రచారాలకు వెళ్తున్నారు. ప్రచారాలకు, మీటింగ్‌లకు వెళితే రోజుకు రూ.500 నుంచి రూ. 1000 వరకు, బిర్యానీ, మందు బాటిల్ ఇస్తారు. మహిళలకైతే డబ్బు, బిర్యానీతో పాటు మరో వంద రూపాయలు అదనంగా ఇస్తున్నారు. అధికార పార్టీ నాయకులే అధికంగా ఓటర్లకు మద్యం, డబ్బు ఎర చూపుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేయిస్తున్నారు. అయితే ఉపాధి పనులకు వెళ్తే రూ. 250కు మించి ఇవ్వడం లేదు. రాజకీయ మీటింగ్‌లకు, ప్రచారాలకు వెళితే సాయంత్రంలోగా డబ్బులు అందుతాయి. దీంతో ఒక్కొక్క ఇంటి నుంచి ఇద్దరు నుంచి ముగ్గురు వరకు రాజకీయ ప్రచారాలకు వెళ్తున్నారు. పొలం పనుల్లో కష్టపడి పని చేసేకంటే ఇదే బాగుంది అని కూలీలు మాట్లాడుకుంటున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం బిర్యానీ, రాత్రి మందు బాటిల్‌తో పాటు రూ.500 నుంచి రూ. 1000 వస్తుంది. మరో 20 రోజుల వరకు ఇదే పని ఉంటుందని, పొలం పనులకు వెళ్లేది లేదని కూలీలు తెలుపుతున్నారు.

- గోనెగండ్ల

అరచేతిలో ప్రచారం!



- సోషల్ మీడియా వేదికగా ప్రచారం
- హోరెత్తిస్తున్న అభ్యర్థులు
- పోస్టు పెట్టు.. ఫాలోవర్స్‌ను పట్టు

ఆదోని, ఏప్రిల్ 22: సోషల్ మీడియా.. ఇప్పుడు ఇదో పెద్ద వేదిక.. అరచేతిలో ఉన్న అద్భుత టెక్నాలజీ. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి సోషల్ మీడియానే ప్రథమ ఆయుధంగా ఎంచుకుంటున్నారు. ఎలక్షన్ నేపథ్యంలో లక్షల సంఖ్యలో ఫాలోవర్స్ ఉండే సోషల్ మీడియా పేజీలను కొందరు డబ్బులకు అమ్మేస్తున్నారు. ఒక్కో ఫాలోవర్‌కు మూడు నుంచి ఐదు వేల వరకు ధర నిర్ణయిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఏపీలోని ప్రధాన నగరాల్లో వీటికి భలే డిమాండ్ ఉండేదని సోషల్ మీడియా స్ట్రాటజిస్టులు చెబుతున్నారు.

సోషల్ మీడియాలో పోస్టుల కంటెంట్ నచ్చితేనే ఎక్కువ మంది వారిని ఫాలో అవుతూ ఉంటారు. ఉదాహరణకు కొందరు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ఎక్స్‌లో ఒక పేజీని ప్రారంభిస్తారు. ప్రస్తుతం ఉన్నటువంటి రాజకీయ పరిస్థితులు ప్రజలకు చేరువయ్యే విధంగా పోస్టులను పెడుతుంటారు. అనంతరం అవి వైరల్ అయిన తరువాత అడ్మిన్‌లు ఈ పేజీలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి రాజకీయ పరిణామాలకు సంబంధించిన వీడియోలు, వాళ్లని కామెంట్ చేస్తూ మీమ్స్.. ఈ విధంగా నిత్యం ఏదో ఒకటి పోస్టు చేస్తుంటారు. ఇలా పెట్టిన పోస్టు లేదా వీడియో వైరల్ అయి నెల రోజుల్లోనే లక్షల్లో ఫాలోవర్స్‌ను సొంతం చేసుకుంటాయి. ఈ విధంగా ఫాలోవర్స్ పెరిగిన తరువాత అడ్మిన్‌ను తొలగిస్తారు. ఒక్క ఫాలోవర్ నుంచి రూ.3 నుంచి రూ.5వేల రూపాయలకు కొంటారు. ఎవరైనా డబ్బు చెల్లిస్తే ఖాతాను వారి పేర్ల మీద మార్చేస్తారు. ఈ విధంగా సోషల్ మీడియా స్ట్రాటజిస్టులకు భలే డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలోనే వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావాహులు వీరిని తాత్కాలికంగా నియమించుకుంటున్నారు. వాళ్లు చేసేటువంటి పర్యటనలు, ప్రసంగాలు నియోజకవర్గ స్థాయిలో ప్రజలను ఆకట్టుకునే విధంగా పోస్టులు పెడుతున్నారు. ఈ విధంగా సామాజిక మాధ్యమాలలో చాలా మంది అభ్యర్థులు దూసుకుపోతున్నారు.

జాతీయ జెండాకు అవమానం



ఎమ్మిగనూరు సర్కిల్లోని పోలీస్ కంట్రోల్ రూం దగ్గర ఏర్పాటు చేసిన బ్యానెర్‌లో జాతీయ జెండా తలకిందులుగా ఉన్న దృశ్యం

ఆదోని, ఏప్రిల్ 22: అసెంబ్లీ ఎన్నికల అధికారి పేరుపై వేయించిన 'ఓటు వేయడం మన హక్కు' అనే డిస్ప్లే బ్యానర్‌లో భారత జాతీయ జెండాకు అవమానం జరిగింది. జాతీయ జెండాను అవమానించే విధంగా ఎన్నికల అధికారులు ముద్రించడం ప్రభుత్వ అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనం. జాతీయతకు భంగం కలిగే విధంగా అధికారుల నిర్వాకం ఉండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వంద శాతం ఓటింగ్‌ను జరిపేందుకు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అయితే అందులో భాగంగానే ప్రచార మాధ్యమాల్లో ఆదోని ప్రచార బోర్డులో జాతీయ జెండాను తలకిందులుగా వేసి అవమానపరిచారు. జాతీయ జెండాను అవమానపరిచిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నాగరాజ్ గౌడ్ తెలిపారు.



ఆదోని పట్టణ నడిబొడ్డున తలకిందులుగా ఉన్న జాతీయ జెండా బ్యానెర్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

బుడ్డా సమక్షంలో టీడీపీలోకి



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

శ్రీశైలం, ఏప్రిల్ 22: శ్రీశైలంలో సోమవారం శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గడిచిన ఐదేళ్ల పాల వైసీపి పాలనలో మాకు ఎలాంటి న్యాయం జరగలేదని మెరుగైన భవిష్యత్తు కోసం టీడీపీతో నడుస్తామని తెలిపారు. గడేసిన శంకర్, గడేసిన కృష్ణ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి బుడ్డా రాజశేఖరరెడ్డి కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో ప్రజలను నమ్మబలికి మోసం చేసిన శిల్పా మళ్లీ ప్రజలను మోసం చేయడానికి ఎలా సిద్ధమయ్యారని బుడ్డా రాజశేఖరరెడ్డి విమర్శించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యత దక్కుతుందని బుడ్డా అన్నారు.

నాలుగో రోజు నామినేషన్లు

ఆత్మకూరు, ఏప్రిల్ 22: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియలో భాగంగా నాల్గో రోజు సోమవారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ అభ్యర్థిగా అభ్యర్థిగా బుడ్డా రాజశేఖరరెడ్డి (రెండోసెట్) తరపున నాయకులు నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు చెప్పారు.

కారు పార్కింగ్ తగాదాలో వ్యక్తి మృతి

మిడుతూరు, ఏప్రిల్ 22: కారు పార్కింగ్ తగాదాలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని నాగలూటి గ్రామంలో ఆదివారం కట్టుబడి కృష్ణ అనే వ్యక్తికి, ఆయన తమ్ముని కొడుకు చంద్రబాబుకు కారును పార్కింగ్ విషయంలో వాగ్వాదం జరిగింది. కృష్ణ కట్టెతో చంద్రబాబును తలపై ఒక దెబ్బ కొట్టి రెండో సారి కొట్టడానికి పోయినప్పుడు చంద్రబాబు కట్టెను పట్టుకుని లాగారు. దీంతో కృష్ణ(58) వెనక్కి పడిపోయి తలకు దెబ్బ తగిలి అక్కడికి అక్కడే మృతి చెందారు. కృష్ణ భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు.

నందికొట్కూరులో టీడీపీ జెండా ఎగరేస్తాం

● నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య ● నామినేషన్ దాఖలు చేసిన జయసూర్య



నందికొట్కూరులో ఆర్వో ముందు ప్రమాణం చేస్తున్న జయసూర్య



అల్లూరులో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 22: వచ్చే ఎన్నికల్లో నందికొట్కూరులో టీడీపీ జెండా ఎగరేస్తామని పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య అన్నారు. సోమవారం ఉదయం 11.39 గంటలకు టీడీపీ నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య నామినేషన్ దాఖలు చేశారు. పత్రాలను ఎన్నికల అధికారి దాసుకు అందజేశారు. అంతకుముందు ఉదయం జయసూర్య సొంత గ్రామమైన అల్లూరులో గోమాతకు పూజలు నిర్వహించి, ఆ తర్వాత సుంకులమ్మ, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాండ్ర శివానందరెడ్డి ఇంటికి చేరుకొని మాండ్ర గిడ్డారెడ్డి దంపతుల చిత్రపటాలకు నమస్కరించి... అక్కడి నుంచి కార్యకర్తలతో నందికొట్కూరుకు బయలుదేరారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర లింగారెడ్డి, మునాఫ్, రామయ్యతో కలిసి జయసూర్య నామినేషన్ దాఖలు చేసేందుకు ఆర్వో కార్యాలయానికి వెళ్లి ఒక సెట్ నామినేషన్ పత్రాలను అధికారి దాసుకు అందజేశారు. అనంతరం అల్లూరు గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. శివానందరెడ్డి మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గంలో చంద్రబాబు గానీ, పవన్ కళ్యాణ్ గానీ పర్యటిస్తారని, అందుకే ప్రస్తుతం నిరాడంబరంగా నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కార్యకర్తలు ఎవ్వరూ అసంతృప్తి చెందవద్దని ఆయన సూచించారు. ప్రచారం మరింత ఉధృతం చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. జయసూర్య మాట్లాడుతూ ఈ ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నమైందని అన్నారు. 2019 ఎన్నికల ముందు జగన్ నందికొట్కూరును నందనవనంగా చేస్తానని ప్రగల్భాలు పలికిన ఆయన సీఎం హోదాలో ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా నందికొట్కూరు రాలేదన్నారు. తనను అసెంబ్లీకి పంపించడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. తనకు టిక్కెట్ ఇప్పించిన ఘనత మాండ్ర కుటుంబానికే దక్కుతుందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్రంలో విధ్వంసకర పాలనను కొనసాగించారన్నారు. ఈ పాలనను అంతమొందించడానికి మాండ్ర శివానందరెడ్డి కంకణబద్ధులై ఉన్నారన్నారు. నియోజకవర్గాన్ని ఎక్స్‌ప్రెస్ హైవేగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు ప్రణాళికలు రచించారన్నారు. కావున టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలను తప్పకుండా గెలిపించుకోవాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

నందికొట్కూరు రూరల్: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన నుంచి విముక్తి పొందేందుకు పోరాడుదామని టీడీపీ ఇన్ చార్జ్ మాండ్ర శివానందరెడ్డి కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో నందికొట్కూరు పటణంలోని 14వ వార్డు వైసీపీ నాయకులు పట్టణ టీడీపీ నాయకుడు సురేంద్ర ఆధ్వర్యంలో మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. మోహన్, రాజెశ్వర ఆచారి, పాండు, సలీం, చాంద్‌బాషా, కరీం, తదితరులతో పాటుగా మరికొంత మంది పార్టీలో చేరారు. కృష్ణారెడ్డి, రవి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణకొట్కూరులో ప్రచారం చేస్తున్నమాండ్ర లింగారెడ్డి

● రాష్ట్రంలో చంద్రబాబుతోనే మహిళా ఆర్థికాభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర లింగారెడ్డి అన్నారు. నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో ఎన్నికల శంఖారావం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. బ్రాహ్మణకొట్కూరు మాజీ సర్పంచ్ ఖలీలుల్లాబేగ్, లక్ష్మీనారాయణ, నయీముద్దీన్, రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరి నామినేషన్

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 22: నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా టీడీపీ ఎంపీ ఎన్నికల కార్యాలయం నుంచి భారీ ఎత్తున వేల సంఖ్యలో ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. పార్టీ కార్యాలయం నుంచి వేలాదిగా బైరెడ్డి శబరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆమె చిన్నాన్న బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఖుద్దూస్, టీడీపీ లీగల్‌సెల్ నాయకుడు మనోహర్‌రెడ్డిలతో కలిసి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి డా.కె. శ్రీనివాసులుకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

జగన్ దొంగల ముఠాను తరమికొట్టండి: శబరి

రాష్ట్రాన్ని దోచుకున్న జగన్ దొంగలముఠాను వచ్చే ఎన్నికల్లో తరిమి కొట్టాలని టీడీపీ నంద్యాల ఎంపి అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం నామినేషన్ దాఖలు అనంతరం నూనెపల్లె సెంటర్‌లో బహిరంగ సభ ఏర్పాటుచేశారు. బైరెడ్డి శబరితో పాటు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల అసెంబ్లీ అభ్యర్ది ఎన్ఎండీ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వైసీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలను గాలికి వదిలేసి వనరులను దోచుకోవడం, వచ్చిన సొమ్మును దాచుకోవడం తప్ప చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. జిల్లాలోని టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్: టీడీపీతోనే అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందుతారని నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి శబరి, అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం కొత్తపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి, 1వవార్డు కౌన్సిలర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం చెప్పాలి: గౌరు చరిత

గడివేముల, ఏప్రిల్ 22: ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత పిలుపునిచ్చారు. మండలంలోని ఆళ్లగడ్డ, బూజనూరు, దుర్వేసి, కొరటమద్ది గ్రామాల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసర ధరలు ఆకాశనంటాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపారన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వైసీపీ నాయకులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే భూకబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్యాయాలను ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని అన్నారు. ఇటీవల తడకనపల్లి గ్రామంలో ముస్లిం నాయకుడిపై వైసీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు.

బాధితులకు పరామర్శ

మండలంలోని తిరుపాడు గ్రామంలో ఈదురు గాలుల వల్ల హోటల్ కుప్పకూలి జీవనాధారం కోల్పోయిన ఉసేన్‌బీని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత పరామర్శించారు. బాధితురాలికి అండగా ఉంటామని అన్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, కృష్ణయాదవ్, సత్యనారాయణరెడ్డి, పంట రామచంద్రారెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎస్‌ఏ రఫిక్, శ్రీనివాసయాదవ్, దిలీప్‌కుమార్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, హర్ష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌరు చరిత

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: ఫరూక్



నంద్యాలలో పర్యటిస్తున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 22: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. సోమవారం క్రాంతి నగర్‌లో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్ఎండీఫరూక్‌తో పాటు ఆయన తనయుడు ఎన్ఎండీ ఫాజిల్ ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్42, 2వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● నంద్యాలలోని 22వ వార్డు క్రాంతినగర్‌లో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిబాబు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, మిలిటరీ శీను, వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. చేరిన వారికి ఫరూక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి. రామచంద్రారావు కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే 19వ వార్డులో వైసీపీ కి చెందిన నాయకులలు, వంద కళాకారుల కుటుంబాలు టీడీపీలో చేరాయి.

రూ.5 లక్షల విరాళం

శ్రీశైలం, ఏప్రిల్ 22: శ్రీశైల క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహి స్తున్న నిత్యా అన్నప్రసాద వితరణ పథకానికి ఎన్టీఆర్ జిల్లా, వెస్ట్ ఇబ్రహీంపట్నానికి చెందిన వీవీ రామ్‌ప్రసాద్, గణేష్ ట్రాన్స్‌పోర్టు వారు రూ. 5,01,116 విరాళాన్ని ఆలయ ఈవో డి.పెద్దిరాజుకు అందజేశారు. అధికారులు దాతకు సామి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

షాపుల ద్వారానే మద్యం అమ్మాలి: ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 22 : ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే మద్యం విక్రయం జరగాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమ వారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో ఎస్పీ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహిం చారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా లోకి తెలంగాణ, కర్ణాటక, మద్యం అక్రమ రవాణా జరగ కూడదన్నారు. మద్యం అక్రమంగా నిల్వ చేయకూడదని, ఎవరు అమ్మినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మద్యం రవాణా చేసే ప్రతి వాహ నానికి జీపీఎస్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)కె. ప్రవీణ్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి. రామ మోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెం డెంట్ కె.మణికంత, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పదిలో విద్యార్థుల ప్రతిభ



వరుణ్ (583)



డి.సోని (582)



సి.భరత్ (580)



వహిదా (578)



యశ్వంత్(577)



లలిత (574)



కార్తీక్ (574)



వెంకటేశ్వర్లు (574)



దుర్గామల్లేష్ (570)



సీహెచ్ హంసిక (569)



వర్షిణి (564)



కేవీ వర్షిత (564)



కల్పనబాయి (564)



వి.ప్రణీత్‌రెడ్డి (563)



జి.భార్గవి (562)



ఎం.మానస (559)



చరణ్‌సాయి (559)



హిమసాయి (551)

వెలుగోడు, ఏప్రిల్ 22: వెలుగోడు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి సాయి చరణ్ 593 మార్కులు, డీపాల్ పాఠశాల విద్యార్థి నిఖిల్ 592 మార్కులు, అదే పాఠశాల విద్యార్థులు సాయి తేజేష్, సుమాంజలి 587 మార్కులు సాధించారు. వెలుగోడు జడ్పీ హైస్కూల్ 72 శాతం, వేల్పనూరు జడ్పీ హైస్కూల్ 81 శాతం, రేగడ గూడూరు జడ్పీ హైస్కూల్ 92 శాతం, ఏపీ మోడల్ స్కూల్ వంద శాతం, కేజీబీవీ 76 శాతం ఉత్తీర్ణ సాధించాయి.

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీనారాయణ విద్యావిహార్ హైస్కూల్ విద్యార్థి సీహెచ్ రష్మిత 592 మార్కులు, శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి ఆర్.చిన్మయి 591 మార్కులు, గౌతమ్ హైస్కూల్ విద్యార్థి అలేఖ్య అక్షర, డిపౌల్ హైస్కూల్ విద్యార్థి లోకేష్ 590 మార్కులు సాధించారు. ఆత్మకూరు మండలంలోని మొత్తం 11 ప్రభుత్వ పరిధిలోని వివిధ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి 597 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 423 మంది పాసవ్వడంతో 71శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మండల విద్యాశాఖాదికారి-1 జానకిరామ్ వెల్లడించారు. కేజీబీవీ విద్యార్థి సీహెచ్ హంసిక 569 మార్కులు, అత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.చరణ్‌సాయి 559 మార్కులు, జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థిని ఎస్.ఫాతిమా 555 మార్కులు సాధించారు.

నందికొట్కూరు: విజయవాణి హైస్కూల్ విద్యార్థులు కె.సాజిదా, ఎస్.మిస్బాబీలు 591, ఎ.భువనేశ్వరి(588), పి.ఇర్ఫాన్, కె.తాబసుమ్ (588) మార్కులు, 550 మార్కులకుపైగా 39 మంది విద్యార్థులు సాధించారు.

మిడుతూరు: ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు శ్రావ్యశ్రీ 591 మార్కులు, డి.సోని 582, సి.భరత్ 580 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. మండలంలో 433 మంది విద్యార్థులకు గానూ 303 మంది విద్యార్థులు పాసై 69.98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీధర్ తెలిపారు.

జూపాడుబంగ్లా: ఆదర్శ పాఠశాల విద్యార్థులు సుప్రజ 587 మార్కులు, మోక్షిత 586 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. జూపాడుబంగ్లాలోని ఆదర్శ పాఠశాలలో 86 మందికిగానూ 85 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 102 మందికి 73 మంది పాసైనట్లు ఎంఈవో చిన్నమద్దిలేటి తెలిపారు. మండ్లెం జడ్పీ హైస్కూల్‌లో 31 మందికి గానూ 22 మంది, తరిగోపుల జడ్పీ హైస్కూల్‌లో 32 మందికి గానూ 21 మంది, పారుమంచాల పాఠశాలలో 48 మందికి గానూ 40, కనకయ్యకొట్టాలలో 29 మందికి 27, గురుకుల పాఠశాలలో 65 గానూ 61 మంది, కస్తూర్బా పాఠశాలలో 36 గానూ 32 మంది పాసైనట్లు ఆయన చెప్పారు.

పగిడ్యాల: పగిడ్యాల, ప్రాతకోట, ముచ్చుమర్రి, నెహ్రూనగర్, ఆదర్శపాఠశాల, కేజీబీవి పాఠశాల, లక్ష్మాపురం బాలికల గురుకుల పాఠశాలలకు చెందిన 457 మంది విద్యార్థులకు గానూ 415 మంది విద్యార్థులు పాస్ కావడంతో 91 శాతం ఉతీర్ణత సాధించినట్లు ఎంఈవో సుభాన్ తెలిపారు. పగిడ్యాల ఆదర్శ పాఠశాలలో 78 మంది విద్యార్థులకు గానూ 76 మంది విద్యార్థులు పాస్ కావడంతో 97 శాతం ఉతీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సృజన తెలిపారు. యశ్వంత్ 577, శోభారాణి 568, ఎస్‌కే సమ్మరిన్ 561 మార్కులు సాధించినట్లు తెలిపారు. 25 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు. కేజీబీవీలో 36 మందికి గానూ 31 మంది విద్యార్థులు ఉతీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ఉషా తెలిపారు. నేహ అనే విద్యార్థిని 534 మార్కులు సాధించినట్లు తెలిపారు. పగిడ్యాల జడ్పీ పాఠశాలలో 53 మందికి గానూ 46 మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. శివ కుమార్ 514 మార్కులు సాధించినట్లు తెలిపారు. పాత ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 మందికి గానూ 37 మంది ఉతీర్ణత త సాధించినట్లు హెచ్‌ఎం కౌసల్య తెలిపారు. దివిషా అనే విద్యార్థికి 529, జ్యోతికి 511 మార్కులు వచ్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. నెహ్రూనగర్ జెడ్పీ పాఠశాలలో 75 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 72 మంది ఉతీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం శేఖర్ తెలిపారు. రాఘవి 552, విజయపాలిన 551 మార్కులు సాదించినట్లు ఆయన తెలిపారు. ప్రాతకోట జడ్పీ హైస్కూల్‌లో 95 మందికి గానూ 76 మంది ఉతీర్ణత సాదించినట్లు హెచ్‌ఎం సువర్ణ తెలిపారు. ప్రగతి 507 మార్కులు సాధించినట్లు తెలిపారు. లక్ష్మాపురం అంచే సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో 78 మందికి గానూ 77 మంది పాస్ కాగా 98.72 శాతం ఉతీర్ణత సాదించినట్లు ప్రిన్సిపాల్ రవణమ్మ తెలిపారు. కీర్తి 557, పుజిత 536 మార్కులు సాధించినట్లు తెలిపారు.

కొత్తపల్లి: మండలంలో 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కొత్తపల్లిలోని రాజరాజేశ్వరి పాఠశాల విద్యార్థిని బోరెడ్డి సుష్మిత 567 మార్కులు సాధించింది. దుద్యాల జడ్పీహెచ్‌ఎస్‌లో ఎ.వర్షిణి 564 మార్కులు, కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ బి.భార్గవి 562 మార్కులు సాధించారు. ముసలిమడుగు హైస్కూల్‌లో 37 మంది పరీక్షలు రాయగా.. 19 మంది పాసై 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. జడ్పీహెచ్ఎస్ కొత్తపల్లిలో 77 మంది పరీక్షలు రాయగా.. 48 మంది పాసై.. 62 శాతం, కేజీబీవీ పాఠశాలలో 28 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 23 మంది పాసై 68 శాతం ఉత్తీర్ణత సాధించారు. జడ్పీహెచ్ఎస్ గోకవరంలో 9మంది పరీక్షలు రాయగా.. 8 మంది పాసై 89 శాతం, అలాగే దుద్యాల జడ్పీహెచ్‌ఎస్‌లో 81 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 58 మంది పాసై 72 శాతం, శివపురం హైస్కూల్‌లో 28 మందికిగానూ 22 మంది పాసై 78 శాతం, పాలెంచెర్వు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాయగా.. ఒకరు పాసైయ్యారు.

గోస్పాడు: గోస్పాడు ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 93 మంది విద్యార్థులకు గాను 92 మంది ఉత్తీర్ణత సాధించారు. మణిష 555 మార్కులు, మురళీ సత్యరాయుడు 544 మార్కులు సాధించారు. కేజీబీవీలో 39 మందికి గానూ 38 మంది ఉత్తీర్ణత సాధించారు. భార్గవి 536 మార్కులు, పూజిత 533 మార్కులు సాధించారు. దీబగుంట్ల ఉన్నత పాఠశాలలో 117 మందికి గానూ 112 మంది ఉత్తీర్ణత సాధించారు. చైతన్య జ్యోతి 566 మార్కులు, మానస 548 మార్కులు సాధించారు. యాళ్ళూరు ఉన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థులకు గానూ 49 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈడిగ రమేష్ 557 మార్కులు, చింతల నక్షత్ర 540 మార్కులు సాధించారు. గోస్పాడు ఉన్నత పాఠశాలలో 75 మంది విద్యార్థులకు గాపై 51 మంది ఉత్తీర్ణత సాధించారు. సిరి చందన 538 మార్కులు, సీమ 504 మార్కులు సాధించారు.

మహానంది: మహానంది గ్రామానికి చెందిన మునగనూరు సుషాంత్(నంద్యాల గురురాజా స్కూల్) 590, గాజులపల్లి గ్రామానికి చెందిన పెద్ద పక్కీరయ్య కుమార్తె గజ్జా సాయి చరిత (నంద్యాలలోని గుడ్‌షప్పర్డ్ స్కూల్) 589 మార్కులు సాధించారు. తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 97 మందిలో 91 మంది పాస్ అయినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు తెలిపారు. వహిదా 578, లలిత 574, హిమసాయి 551 మార్కులు సాధించినట్లు తెలిపారు. తిమ్మాపురం జడ్పీ హైస్కూల్‌లో 70 మందికి గానూ 57 మంది పాస్ అయినట్లు ఎంఈవో రామసుబ్బయ్య తెలిపారు. కేజీబీవీలో 38 మందికి గానూ 37 మంది పాస్ అయినట్లు ఎంఈవో తెలిపారు. పుష్పావతి 500 మార్కులు సాధించినట్లు తెలిపారు.

బండిఆత్మకూరు: మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 87.08 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 387 మందికి గానూ 337 మంది ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థి కార్తీక్ 574, బండిఆత్మకూరు హైస్కూల్ విద్యార్థులు వెంకటేశ్వర్లు 574, దుర్గా మల్లేష్ 570, మోడల్ స్కూల్ విద్యార్థులు రామేశ్వరరెడ్డి 561, సాయి ప్రణతి 555, లింగాపురం హైస్కూల్ విద్యార్థి నాగార్జున సాయి 533, కేజీబీవీ విద్యార్థిని శిల్ప 527 మార్కులు సాధించారు.

పాములపాడు: పాములపాడులోని మోడల్ స్కూల్ విద్యార్థి వరుణ్ 583 మార్కులు, పాఠశాలలో 99శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. లింగాల జడ్పీహెచ్‌ఎస్‌లో 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాములపాడు పాఠశాలలో 72 శాతం ఉత్తీర్ణత.. ఉదయ్ కిరణ్ 556 మార్కులు సాధించారు. తుమ్మలూరులో 63 శాతం.. సానియా 541 మార్కులు సాధించారు. వాణాల పాఠశాలలో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. వేంపెంట పాఠశాలలో 78 శాతం ఉత్తీర్ణ.. అభిలాష్ 551 మార్కులు సాధించారు. మిట్టకందాల జిల్లా పరిషత్ పాఠశాలలో 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాములపాడు కేజీబీవీలో 83 శాతం ఉత్తీర్ణత.. కీర్తన 521 మార్కులు సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలో 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాదించినట్లు ఎంఈవో బాలాజీ నాయక్ తెలిపారు.

పాణ్యం: పది పరీక్ష ఫలితాల్లో పాణ్యం మండలం 90. 84 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని కేశవరెడ్డి పాఠశాల విద్యార్థి ఉదయ్‌కుమార్ 592 మార్కులు సాధించాడు. కేజీబీవీ గురుకుల, మహాత్మా జ్యోతిబాపూలే గరుకుల, కేఆర్ఆర్, లక్ష్మీగాయత్రి పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కోటయ్య తెలిపారు.

గడివేముల: కరిమద్దెల హైస్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, గడిగరేవుల హైస్కూల్ 98 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆదర్శ పాఠశాలలో 92 శాతం, గడివేముల హైస్కూల్ 92 శాతం, కేజీబీవీ 92 శాతం, గని హైస్కూల్ 92 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఆదర్శ పాఠశాల విద్యార్థిని కేవీ వర్షిత 564 మార్కులు, గడివేముల కేజీబీవీ విద్యార్థిని బి.కల్పనబాయి 564 మార్కులు, ఆదర్శ పాఠశాల విద్యార్థి వి.ప్రణీత్‌రెడ్డి 563 మార్కులు, ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎం.మానస 559 మార్కులు సాధించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పేదల ద్రోహి జగన్: బీసీ

బనగానపల్లె, ఏప్రిల్ 22: పేదల సంక్షేమ పథకాలు రద్దు చేసిన ద్రోహి సీఎం జగన్ అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్, మార్కెట్ వీధి, ఈద్గానగర్ పరిసర ప్రాంతాల్లో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రజాగళం కార్యక్రమంలో బీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌కు ఓటు అడిగే అర్హత లేదన్నారు. మద్యనిషేధం చేసి ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ మాట తప్పారన్నారు. నాసిరకం మద్యం అమ్మి 35 లక్షల మంది ఆరోగ్యాన్ని నాశనం చేశారన్నారు. 30వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. విద్యుత్ చార్జీలు 9 సార్లు పెంచి ప్రజలపై రూ. 64 కోట్ల భారం మోపారన్నారు. విద్యుత్ మీటర్ల కొనుగోలులో రూ.15వేల కోట్లు దోచుకున్నారన్నారు. మెగా డీఎస్సీ ఇస్తామని దగా చేశారన్నారు. 2.30 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను వంచించారన్నారు. ప్రత్యేక హోదాను ఆటకెక్కించా రన్నారు. కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను పారిపోయేలా చేశారన్నారు. ఇసుక రేట్లుపెంచి భవన కార్మికులకు పనిలేకుండా చేశారన్నారు. పెట్రోల్, డీజల్, బస్సు చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదల పొట్టకొట్టారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఒక్కొక్క కుటుంబంపై రూ.8కోట్ల భారం మోపారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రుణాలు ఇవ్వకుండా వారిని వంచించారన్నారు. టీడీపీ హయాంలో అమలు పరిచిన 100 చంద్రన్న సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని బీసీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన 250 కుటుంబాలు సోమవారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వైసీపీ కీలక నాయకులు అన్నెం జయరామిరెడ్డి, మారుతిప్రసాద్‌రెడ్డి, అన్నెంగురివిరెడ్డి, సాయినాథరెడ్డి, శివప్రసాదరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దకులాయి, చిన్నకులాయి, అంబటి అర్జున్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాముడు తదితరులు ఇందులో ఉన్నారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ రాయల్టీ, డెడ్‌రెంట్లు, పూర్తిగా పెంచి వైసీపీ ప్రభుత్వం నాపరాయి పరిశ్రమను దగా చేసిందన్నారు. అందుకే వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారని అన్నారు. అలాగే బనగానపల్లె పట్టణం కొండపేటకు చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. తమ్మడపల్లె గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.



ప్రజాగళంలో బీసీకి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

టీడీపీలో చేరిన గిద్దలూరులోని వైసీపీ కుటుంబాలు

సంజామల: సంజామల మండలం గిద్దలూరులో 50 వైసీపీ కుటుంబాలు సోమవారం బీసీ ఇందిరమ్మ సమక్షంలో టీడీపీలో చేరాయి. సంజామల మండలం గిద్దలూరులో సూపర్ సిక్స్ పథకాలపై బీసీ ఇందిరమ్మ, కోడలు బీసీ క్షీరారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. వైసీపీ నాయకుడు బత్తుల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నీలినాగయ్య, పసుపులేని వెంకటకృష్ణయ్య, మహబూబ్ బాషా, నరసింహులు తదితర 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.



మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన అంకిరెడ్డిపల్లెకు చెందిన వైసీపీ నాయకులు



గిద్దలూరులో ప్రచారం చేస్తున్న బీసీ ఇందిరమ్మ, బీసీ క్షీరారెడ్డి

పదిలో శ్రీసుధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న శ్రీసుధ పాఠశాల యాజమాన్యం



ప్రతిభ కబర్చిన విద్యార్థినులు

డోన్(రూరల్), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీసుధ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. పాఠశాలకు చెందిన ఆయేషా అనే విద్యార్థిని 593/600 మార్కులు, భావన 590, ఎస్.సుహానా 590 మార్కులు సాధించారు. 140 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 77 మంది విద్యార్థులు 500 మార్కులు పైగా సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, రాగ సుధాకర్ గుప్త, ప్రధానోపాధ్యాయురాలు ఫర్హానా అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో డోన్ మోడల్ స్కూల్ విద్యార్థులు 104 మంది పరీక్షలు రాయగా.. వారిలో 103 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ జాస్మిన్ తెలిపారు. పాఠశాలకు చెందిన కె.సుదర్శన్ 588 మార్కులు, కె.అనుశ్రీ 587, కె.మౌనిక 584 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే పాతపేట జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తేజావర్ధన్ 570 మార్కులు సాధించారు.



సుదర్శన్, అనుశ్రీ, మౌనిక

పదిలో రాణించిన విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

చాగలమర్రి, ఏప్రిల్ 22: చాగలమర్రి ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 574 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 437 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎం.మోమిన్ 573 మార్కులు, చింతలచెరువు ఉన్నత పాఠశాలకు చెందిన స్నేహలతారెడ్డి 557 మార్కులు, బాలుర పాఠశాలకు చెందిన కేవీ ప్రవీణ 550 మార్కులు సాధించారు. విద్యార్థులను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్ఎంలు కోటయ్య, విజయలక్ష్మి, సీఆర్పీలు అభినందించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 186 మంది హాజరు కాగా 175 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన ప్రవల్లిక 579 మార్కులు, బ్రిలియంట్ పాఠశాలకు చెందిన లహరి 577 మార్కులు, రాఘవేంద్ర పాఠశాలకు చెందిన గౌతమ్ 576 మార్కులు సాధించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 760 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 612 మంది ఉత్తీర్ణత సాధించారు.

శిరివెళ్లలో..



ప్రతిభ కనబర్చిన సాజిదా, అత్తర్ ఆసిఫ్

శిరివెళ్ల, ఏప్రిల్ 22: పదో తరగతి వార్షిక ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మొత్తం 594 మంది విద్యార్థులకు గానూ 556 మంది ఉత్తీర్ణులవ్వడంతో 93.6 ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు ఎంఈవోలు శంకర్ ప్రసాద్, నాగార్జునరెడ్డి సోమవారం తెలిపారు. యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 95 మందికి గాను 79 మంది ఉత్తీర్ణులవ్వడంతో 83.15 ఉత్తీర్ణత శాతం నమోదైంది. పాఠశాలకు చెందిన సాజిదా అనే విద్యార్థిని 573 మార్కులు సాధించినట్లు తెలిపారు. రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 30 మందికి ా 29 మంది ఉత్తీర్ణులై 96.6 ఉత్తీర్ణత శాతం, శిరివెళ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 39 మందికి 39 మంది ఉత్తీర్ణులై వంద శాతం, శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 96 మందికి 91 మంది ఉత్తీర్ణులై 94.7 ఉత్తీర్ణత శాతం సాధించారు. మహదేవపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 29 మందికి 19 మంది ఉత్తీర్ణులై 65.5 ఉత్తీర్ణత శాతం, వీరారెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 17 మందికి వంద శాతం, గోవిందపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 68 మందికి గాను 68 మంది ఉత్తీర్ణులై వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో 80 మందికి గానూ 75 మంది ఉత్తీర్ణులై 93.7 ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. పాఠశాల విద్యార్థి అత్తర్ ఆసిఫ్ 559 మార్కులు సాధించారని చెప్పారు.

దొర్నిపాడులో..



ప్రతిభ కనబర్చిన ప్రవీణ్‌కుమార్, పి.వైష్ణవి, బి. భానుప్రసాద్

దొర్నిపాడు, ఏప్రిల్ 22: మండలంలోని దొర్నిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల, భాగ్యనగరం ఉన్నత పాఠశాల, డబ్ల్యూ కొత్తపల్లి, కస్తూర్బా పాఠశాలల్లో మొత్తం 230 మంది విద్యార్థులకు గానూ 210 మంది ఉత్తీర్ణత సాధించారు. సి.ప్రవీణ్‌కుమార్ 544 మార్కులు, పి.వైష్ణవి 538, బి.భానుప్రసాద్ 535 మార్కుతు సాధించినట్లు ఎంఈవో చంద్రశేఖర్, ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, భాస్కర్, జ్యోతి తెలిపారు.

అవుకులో 88.2 శాతం ఉత్తీర్ణత

కోవెలకుంట్ల, ఏప్రిల్ 22: అవుకు మండలంలో పదోతరగతి ఫలితాల్లో 88.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీధర్‌రావు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గుండ్ల శింగవరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి అమరేశ్వర్‌రెడ్డి 591 మార్కులు సాధించారు. అలాగే సుంకేలకు చెందిన విద్యార్థిని అర్చన 569 మార్కులు, అవుకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని దివ్య 568 మార్కులు సాధించారు. అవుకు పట్టణంలోని మదర్‌మోడల్ హైస్కూల్‌కు చెందిన మృదుల 595 మార్కులు సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

పదిలో 81 శాతం ఉత్తీర్ణత

బనగానపల్లె, ఏప్రిల్ 22: మండలంలో పదోతరగతి ఫలితాల్లో 81శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో స్వరూప తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 1069 మంది పరీక్షలు రాయగా 867 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. బనగానపల్లె బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన శ్వేత 583 మార్కులు సాధించారని తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు పదిలో ప్రతిభ కనబరచి 95.6 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి తెలిపారు. మహేశ్‌బాబు 579, శివమణి నాయక్ 577, హరిణి 576, రిషి గణేశ్ 575, భానుప్రకాశ్ 570 మార్కులు, లక్ష్మీప్రసన్న 569, హజరబీ 563, గౌతమి 562, లిఖిత 561, రాజేశ్వరి 554 సాధించినట్లు ఆమె తెలిపారు.

మోడల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న కోటకందుకూరు ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజు

నంద్యాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు ఏపీ మోడల్ పాఠశాల ప్రభంజనం సృష్టించిందని ప్రిన్సిపాల్ రాజు సోమవారం చెప్పారు. పదో తరగతిలో పాఠశాల నుంచి పరీక్షలు రాసిన విద్యార్థినిల్లో వై.జ్యోత్స్నాదేవి 589, వక్కపెల్ల సమీర 583, ఎ. తేజస్విని 579, ముల్లా హబీబా 575, పి.వర్షిత 571, పి.లలిత 565 మార్కులు సాధించారని చెప్పారు. పాఠశాలలో 21 మంది 500 మార్కులకు పైగా సాధించారని అన్నారు. గణితంలో ఏడుగురు విద్యార్థులు వంద సాధించారని చెప్పారు.

పదిలో సత్తా చాటిన విద్యార్థులు



ప్రతిభ కనబర్చిన జశ్విత, మానసలక్ష్మీ, గంగా

రుద్రవరం, ఏప్రిల్ 22: నరసాపురం ఉన్నత పాఠశాలలో 29 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. నందలూరు ఎయిడెడ్ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. రుద్రవరం ఆదర్శ పాఠశాలలో 98 శాతం, కేజీబీవీలో 95 శాతం, ఆలమూరు ఉన్నత పాఠశాలలో 90 శాతం, ఎర్రగుడిదిన్నెలో 94 శాతం, పెద్ద కంబళలూరులో 80 శాతం, ఎల్లావచ్చులలో 87 శాతం, రుద్రవరం 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. జశ్విత 576, మానసలక్ష్మీ 565, గంగా 552, చరణి 553, సుప్రియ 554, ఉషారాణి 550, మధుమోహన్ 554, హరినాథ్ 570 మార్కులు సాధించారు.

మోడల్ స్కూల్ విద్యార్థిని..



ప్రతిభ కనబర్చిన మధుపావని

బేతంచెర్ల, ఏప్రిల్ 22: మండలంలోని గోరుమానుకొండ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని మధుపావని 590/600 మార్కులు సాధించింది. సోమవారం పది పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిన హరికృష్ణ శెట్టి, ప్రమీల దంపతుల రెండో కుమార్తె మధుపావని అత్యధిక మార్కులు సాధించడంపై పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో..



అమృత

ప్యాపిలి, ఏప్రిల్ 22: పదిలో ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 90.34 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని అలేబాదు ఆశ్రమ పాఠశాల 100శాతం, ప్యాపిలి బాలికల పాఠశాల 99.3శాతం, చిన్నపూదిళ్ల 87.5శాతం, పోతుదొడ్డి 91.67శాతం, ప్యాపిలి బాలుర పాఠశాల 84.68శాతం, కేజీబీవీ 96.97 శాతం, వెంగళాంపల్లి 90.91శాతం, ఏనుగమర్రి 83.93 శాతం, జలదుర్గం 88.61శాతం, రాచెర్ల 94.34 శాతం, హుసేనాపురం 85.53 శాతం, పీఆర్‌పల్లి 78.43శాతం, బూరుగుల 92.86శాతం, శ్రీసరస్వతి శిశుమందిర పాఠశాల 96.97 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే పీఆర్ పల్లి పాఠశాలకు చెందిన అమృత 567 మార్కులు, ప్యాపిలి బాలికల పాఠశాల విద్యార్థిని రియాశ్రీ 564, అఖిల 562 మార్కులు సాధించారు.

ఆల్వకొండ జడ్పీ విద్యార్థులు..



ధరణి లక్ష్మి

సంజామల, ఏప్రిల్ 22: పది పరీక్ష ఫలితాల్లో ఆల్లకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల వ్యాప్తంగా 83 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రమైన సంజామలలో కస్తూర్బా బాలికల పాఠశాలలో 91.4 శాతం, పేరుసోముల ఉన్నతపాఠశాల 89 శాతం, గిద్దలూరు 87శాతం, కానాల 66శాతం, సంజామల 84శాతం, ఆకుమళ్ల 79.2 శాతం, నొస్సం 76శాతం, కమలపురి 73శాతం సాధించినట్లు తెలిపారు. ఆకుమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ధరణిలక్ష్మి 570 మార్కులు సాధించారు. ద్వితీయ స్థానంలో 569 మార్కులు సాధించి హరిప్రియ, సం జామల ప్రభుత్వపాఠశాల విద్యార్థి గీతావాణి 559 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. కానాల జడ్పీ ఉన్నత పాఠశాలలో ముగ్గురు బాలికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు.

'టీడీపీకి ప్రజల్లో ఆదరణ'

రుద్రవరం, ఏప్రిల్ 22: టీడీపీకి ప్రజల్లో ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ నాయకుడు కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని దక్షిణకొట్టాలు గ్రామంలో సూపర్‌సిక్స్ పత్రాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు చైతన్యంతెచ్చారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు

నక్కలదిన్నెలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత

రుద్రవరం, ఏప్రిల్ 22: రుద్రవరం మండలంలోకి నక్కలదిన్నె గ్రామంలో సోమవారం 43 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. తూర్పు కనుమల్లో ఉదయాన్నే సూర్యుడు ఎరుపెక్కాడు. నక్కలదిన్నె గ్రామంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఈ ఎండలకు జనం బెంబేలెత్తి పోతున్నారు. ఉదయాన్నే సూర్యకిరణాలు ఎరుపెక్కి ఈ ఎండలు మండిస్తున్నాయి.

'ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి'



మాట్లాడుతున్న ఆర్వో మల్లికార్జునరెడ్డి

నంద్యాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం గ్రామంలో ఓటర్లకు అవగాహన కార్యక్ర మాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్వో నజీర్ అహమ్మద్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 100 కుటుంబాలు

బేతంచెర్ల, ఏప్రిల్ 22: మండలంలోని సిమెంటునగర్, బుగ్గానిపల్లె, ముస లాయ చెరువు, రుద్రవరం, గుటుపల్లె గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో డమాల్ శ్రీనివాసరావు, మేకల బజయ్య, జే. మద్దయ్య, సుబ్బరాయుడు, మాధవ లచ్చమ్మ, రఘునాథ్, పద్మనాభ్ కుమార్, హరికృష్ణ, మనోహర్, మధుసూదన్, మద్దయ్య, రామసుబ్బయ్య, మధు, సుధాకర్ ఉన్నారు.

చెన్నకేశస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బేతంచెర్ల, ఏప్రిల్ 22: పట్టణంలోని గౌరిపేటలో ఆంజనేయ స్వామి ఆలయంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయాల ఈవో మద్దిలేటి, ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో టీడీపీ జెండా ఎగురవేస్తాం

చాగలమర్రి, ఏప్రిల్ 22: ఆళ్లగడ్డలో టీడీపీ జెండాను ఎగురవేయడం తథ్యమని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. సోమవారం ఆళ్లగడ్డలో టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ నామినేషన్ సందర్భంగా చాగలమర్రి నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. అంతకముందు టీడీపీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ అఖిలప్రియ విజయం కోసం సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు నాగరాజు, నరసింహులు, ఉసేన్‌వలి, షరీఫ్, మౌళాలి, అనీఫ్, మాబులాల్, నాగరాజు, గఫార్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీల సాధికారత'

చాగలమర్రి, ఏప్రిల్ 22: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, దూదేకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. సోమవారం బీసీ సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని అన్నారు. బీసీల సబ్‌ప్లాన్ అమలు పరిచిన ఘనత టీడీపీదే అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీల నిధులను దుర్వినియోగం చేసిందని, ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 22: గ్రామాల్లో ప్రజలు వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. పిల్లలు, పెద్దలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీడనిచ్చే ప్రదేశాల్లో ఉంటూ చల్లని మజ్జిగ, శీతల పానియాలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ సోకిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఎండ తీవ్రత వల్ల జ్వరం, విరేచనాలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. అధిక భాగం నీడలో ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య లేకుండా చూడాలి'

రుద్రవరం, ఏప్రిల్ 22: మండలంలోని 16 సచివాలయం పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ సూచించారు. సోమవారం గ్రామ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశామన్నారు. అలాగే గ్రామాల్లో మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తోడుతున్న వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించామన్నారు. పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించామన్నారు.

ఎక్స్‌కవేటర్ స్వాధీనం

రుద్రవరం, ఏప్రిల్ 22: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె సోమయాజుల చెరువులో ఆదివారం రాత్రి మట్టి తవ్వకాలు అనుమతి లేకుండా చేపట్టారు. మట్టిని తవ్వి రవాణా చేస్తుండగా ఎస్ఐ నిరంజన్‌రెడ్డి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఎక్స్‌కవేటరు, ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకుని రుద్రవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ వాహనాలను రుద్రవరం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ సోమవారం తెలిపారు.

'వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి'

రుద్రవరం, ఏప్రిల్ 22: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నాయకులు భార్గవరామ్ నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని చిత్తరేణిపల్లె గ్రామానికి చెందిన బాలయ్య, శ్రీనివాసులు, బాలరాజు, బాలనరసింహుడు, నాగయ్యతో పాటు మరి కొన్ని కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ పార్టీ కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోల గురుమూర్తి, సత్యనారాయణ, మల్లయ్య, సుబ్బారావు నరసయ్య తదితరులు ఉన్నారు.

'భూసార పరీక్షలు చేయించాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 22: గ్రామాల్లో రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల లాభాదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని మద్దూరు గ్రామాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చీడ పీడలు నివారించడంలో పంటల సమగ్ర సస్యరక్షణలో రసాయన పద్ధతులు, భౌతిక పద్ధతులు యాంత్రిక పద్ధతులు పాటించాలని సూచించారు. భూమిని ఖాళీగా వదిలి వేయడం వల్ల కలుపు మొక్కలు పెరిగి భూమి సారవంతం తగ్గుతుందన్నారు. పంట కోసిన వెంటనే వాలుకు అడ్డంగా లోతైన దక్కులు దున్నుకోవాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ నాటికి రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచుతామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జి రాధాకృష్ణ ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : కాటసాని

బనగానపల్లె, ఏప్రిల్ 22: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి అవుకు మండలం మెట్టుపల్లెలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీసీ జనార్దన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు వంగల పరమేశ్వరరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్యాపిలి, ఏప్రిల్ 22: మండలంలోని పోతుదొడ్డి గ్రామం దగ్గర జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్యాపిలికి చెందిన కోట్ల రాఘవేంద్రరెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట నాయకులు రాజానారాయణమూర్తి, ఖాజాపీర్, బత్తుల రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'విద్యార్థుల మార్కులను నమోదు చేయాలి'

చాగలమర్రి, ఏప్రిల్ 22: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జరిగిన ఎఫ్ఏ-1, 2 పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సూచించారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో విద్యార్థుల పరీక్ష పత్రాలను భద్రపరిచారు. వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఎండలో తిరగకుండా ఉండేలా తల్లిదండ్రులు చూసుకోవాలని సూచించారు.

'టీడీపీ గెలుపునకు కృషి చేద్దాం'

రుద్రవరం, ఏప్రిల్ 22: ఆళ్లగడ్డలో టీడీపీ గెలుపునకు కృషి చేద్దామని టీడీపీ నాయకులు పిలునిచ్చారు. ఆళ్లగడ్డలో భూమ అఖిల ప్రియ నామినేషన్‌కు భారీ సంఖ్యలో ఆళ్లగడ్డకు కార్యకర్తలు, నాయకులు, భూమ అభిమానులు, జనసైనికులు, బీజేపీ కార్యకర్తలు నాయకులు తరలివెళ్లారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

ప్యాపిలి, ఏప్రిల్ 22: పట్టణంలోని వెంగన్న బావి అభయాంజినేయస్వామి ఆలయంలో సోమవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.


రేకులకుంటలో తాగునీటి ఎద్దడి



తాగునీటి కోసం క్యూలో పెట్టిన బిందెలు

డోన్(రూరల్), ఏప్రిల్ 22: మండలంలోని రేకులకుంట గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఇళ్లకు వదిలే నీటి సరఫరాకు సంబంధించిన మోటార్లు మరమ్మతులకు గురి కావడంతో తాగునీటి సమస్య తలెత్తిందని స్థానికులు వాపోయారు. విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ దృష్టికి తీసుకెళ్లగా.. మోటారు మరమ్మతులు చేయిస్తామన్నారు.

మోసపు హామీల వైసీపీని తరిమి కొట్టండి: కోట్ల



టీడీపీలో చేరిన వారితో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, సుబ్బారెడ్డి

డోన్, ఏప్రిల్ 22: మోసపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా ముంచేసిన వైసీపీని తరిమి కొట్టాలని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ధర్మవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు భూపాల్ రెడ్డితో పాటు మరో 30 కుటుంబాలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరాయి. అదే విధంగా వైసీపీకి చెందిన సీనియర్ న్యాయవాది కోట్ల హరిశ్చంద్రా రెడ్డి టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాది నల్లమేకలపల్లి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

- పట్టణంలోని కోట్ల నివాసంలో టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో సోమవారం ఇందిరాంపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.
- టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపు కోసం పట్టణంలోని ముస్లిం మైనార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

ప్యాపిలి: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను మెనిఫెస్టోలో ప్రకటించినట్లు డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుడిపాడు, హెచ్‌ఆర్‌పల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈటీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్, టి శ్రీనివాసులు, రామసుబ్బయ్య, వెంకటరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.